సాక్షి
జగిత్యాల
శనివారం । 18 । నవంబర్ । 2023



### హారతి గైకొను'మా'

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో శుక్రవారం నాల్గో రోజు గంగాహారతి కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.



### అదనపు డీజీపీ పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం అదనపు డీజీపీ సతీశ్‌గణేశ్ దర్శించుకున్నారు. ఈవో శ్రీనివాస్ స్వామివారి ప్రసాదం అందజేశారు.

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### జిల్లాకు తేలికపాటి వర్షసూచన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రాబోయే ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32- 33 డిగ్రీల సెల్సియస్‌గాను, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. గాలిలో తేమ ఉదయం 65-78 శాతం, 52-60 శాతం మధ్య, ఈశాన్య దిశ నుంచి ఈదురుగాలులు గంటకు 5-8 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని వివరించారు.

### నేడు జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన



జగిత్యాల: ఎమ్మెల్సీ కవిత శనివారం జగిత్యాల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు మైతాపూర్, 10 గంటలకు ఇటిక్యాల, 12 గంటలకు తాట్లవాయి, కట్కాపూర్ ఎక్స్‌రోడ్, మధ్యాహ్నం 1 గంటకు బీర్‌పూర్, 3 గంటలకు అల్లీపూర్, 4 గంటలకు రాయికల్ టౌన్ ఓల్డ్‌బస్టాండ్, 5 గంటలకు గాంధీచౌక్, 7 గంటలకు జగిత్యాల మంచినీళ్ల బావి వద్ద ప్రచారంలో పాల్గొననున్నారు.

### కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాల: ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు, బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని సాధారణ పరిశీలకులు రాజీవ్‌రంజన్ మీనా, పోలీసు పర్యవేక్షకులు వివేకానందసింగ్ అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ లతతో కలిసి నూకపల్లిలోని వీఆర్‌కే కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్‌రూమ్ తదితర గదులను పరిశీలించి అన్ని వసతులు ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలోని సమస్యాత్మక, ఇతర పోలింగ్ కేంద్రాలను సైతం పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో నర్సింహమూర్తి, పంచాయతీరాజ్ ఏఈ రహమాన్ తదితరులు ఉన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



సాద్విక్‌కు మెమొంటో అందజేస్తున్న అధికారులు

జగిత్యాలజోన్: రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన బూసారపు సాద్విక్‌గౌడ్ సత్తాచాటి మూడో స్థానం దక్కించుకున్నాడు. కళా ఉత్సవ్-2023 పేరిట ఈ నెల 16, 17వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పియానో విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, తెలంగాణ తరుపున మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా సాద్విక్‌గౌడ్‌ను జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

### ప్రభుత్వ భూమిలో జెండాలు పాతిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: ప్రభుత్వ భూమిలో జెండాలు పాతిన వ్యక్తులపై కేసు నమోదైంది. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులో అనుమతి లేకుండా సమావేశం నిర్వహించడంతో పాటు ప్రభుత్వ భూమిలో సీపీఎంకు చెందిన జెండాలు ఎగురవేసి ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని ఫ్లయింగ్‌స్క్వాడ్ టీం అధికారి, జగిత్యాల మున్సిపల్ టీపీవో కనిగారపు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సీపీఎంకు చెందిన నాయకులపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సై వివరాలు.. సీపీఐఎం జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, ఏఐడీఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్గొండ పద్మ, సీపీఎం పట్టణ కన్వీనర్ గర్వందుల రమేశ్‌తో పాటు మరికొంత మంది ప్రభుత్వ భూమిలో జెండాలు ఎగురవేసి, ఎలాంటి అనుమతి లేకుండా సమావేశం నిర్వహించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి అక్కడకు వెళ్లి వారి సమావేశ అనుమతిపత్రం చూపించాలని కోరగా ఎలాంటి అనుమతి లేదని తేలింది. ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి ఫిర్యాదు మేరకు కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు చేశారు.

# కాంగ్రెస్ బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టుండ్రి

## అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శలు చేసిన సీఎం కేసీఆర్

- 'గంగుల' మొండి మనిషి
- కౌశిక్‌కు మెజారిటీ ఇవ్వండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించండి
- జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో గులాబీ శ్రేణుల్లో జోష్





జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్/హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/గంగాధర: రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ శుక్రవారం కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. పదేళ్లలో తాము చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శల వర్షం కురిపించారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో సీఎం ప్రసంగం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఓ వైపు జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరిస్తూనే మరోవైపు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో, పదునైన మాటలతో ధ్వజమెత్తారు. 60 ఏళ్లు పరిపాలించిన ప్రతిపక్షాలు చేసిందేమీ లేదని, తాము పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కళ్లముందు పరుగులు పెడుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని, అలాంటి పార్టీని జిల్లా ప్రజలు 2001లో జరిగిన సింహగర్జన సభ నుంచి అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. రాయేదో.. రత్నమేదో ఆలోచించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. మంత్రి గంగుల కమలాకర్ మొండి మనిషి అని ఆయన హయాంలో తీగలవంతెన, మానేరు రివర్ ఫ్రంట్, స్మార్ట్‌సిటీ పనులతో కరీంనగర్ సుందరీకరణ, కూడళ్ల అభివృద్ధి పరుగులు పెడుతోందని కితాబిచ్చారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

**34 నిమిషాలు ప్రసంగం...**

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో 34 నిమిషాలు ప్రసంగించారు. హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి సభాప్రాంగణానికి 1.38 నిమిషాలకు చేరుకున్నారు. తెలంగాణ ప్రగతి రథంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావు తదితరనేతలతో కలిసి 1.50నిమిషాలకు వేదికపైకి చేరుకున్నారు. మొదటగా కరీంనగర్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. సీఎం కేసీఆర్ సరిగ్గా 2.02 నిమిషాల నుంచి 2.36 నిమిషాల వరకు మాట్లాడారు. 2001లో సింహగర్జన సభను ఇదే వేదికగా నిర్వహించామని అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక విజయాలు సాధించామని, 50 ఏళ్ల కాంగ్రెస్ దరిద్రపు పాలనకు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు బేరీజు వేసుకుని బాగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్సీ మధుసూధనచారి, కార్పొరేషన్ చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, కుర్మాచలం అనిల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మరోసారి ఆశీర్వదించండి



కరీంనగర్ నియోజకవర్గంలో రూ.వేలకోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటి పరంపర కొనసాగింపునకు మరోసారి ఆశీర్వదించి, గెలిపించండి. గతంలో కరీంనగర్ బొందలగడ్డగా ఉండేది. పదేళ్లల్లో రూ.వేలకోట్ల పనులతో రూపురేఖలు మారిపోయాయి. సీఎం కేసీఆర్‌కు జిల్లాపై అమితమైన ప్రేమ ఉంది. తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి సింహగర్జన బహిరంగసభ నుంచి ఇప్పటి వరకు జిల్లా ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఢిల్లీ పాలకుల చేతుల్లో పెట్టొద్దు. జిల్లా ప్రజలు అభివృద్ధి వైపో.. విధ్వంసం వైపో తేల్చుకుని ఓటు వేయండి. – గంగుల కమలాకర్, కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

### రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా



ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. కేసీఆర్ కాళ్లు పట్టుకోనైనా హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా. ఉప్పల్, చల్లూరు, వావిలాల మండలాల ఏర్పాటుకు కృషి చేస్తా. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే ప్రజలకు వెన్నుపోటు పొడిచి గజ్వేల్‌లో పోటీ చేస్తుండు. 15 ఏళ్లుగా ప్రజాసేవలోనే ఉన్నా. ఒక్కసారి అవకాశం ఇవ్వండి . అభివృద్ధి చేసి చూపిస్తా.
– పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి



కేసీఆర్‌కు గద అందిస్తున్న సునీల్‌రావు

### కుక్కలు చింపిన విస్తరి అవుతుంది



తెలంగాణ తెచ్చాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. గోదావరి జలాలతో కోటి ఎకరాలకు సాగునీరు అందించి చూపిస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. వందేళ్ల వరకు ప్రగతి పరుగులు పెట్టే విధంగా ప్రణాళికలున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మితే తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కేసీఆర్‌కు అండగా గులాబీ జెండా ఉంది. మంత్రి గంగులను భారీ మెజార్టీతో గెలిపించాలి.
– బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

### కొంగుపట్టి కోరుతున్నా

హుజూరాబాద్ నియోజకవర్గంలో 15 ఏళ్ల నుంచి ప్రజా సేవలోనే ఉన్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడప గడపకు చేరవేస్తున్నాం.కొంగు పట్టి కోరుతున్నా కౌశిక్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన వెంటే నేను ఉంటా. – శాలిని, పాడి కౌశిక్‌రెడ్డి భార్య



సీఎం కేసీఆర్‌కు బొట్టు పెడుతున్న పాడికౌశిక్ కూతురు శ్రీనిక

### డాడీకి ఒక్క చాన్స్ ఇవ్వండి

హుజూరాబాద్ నియోజకవర్గాన్ని హైదరాబాద్‌లా అభివృద్ధి చేయాలన్నదే మా డాడీ కళ. మీ అందరికీ దండంపెట్టి కోరుతున్నా. డాడీకి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. డాడీ వెంట పడి హుజూరాబాద్ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు తెచ్చేలా చేస్తా.
– శ్రీనిక, కౌశిక్‌రెడ్డి కూతురు

## ఓటుహక్కును వినియోగించుకోవాలి

జగిత్యాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో విద్యార్థుల పాత్ర ప్రధానమైందని, ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ఏవో శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, సుధీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





అవగాహన సదస్సులో మెడికోలు

### వసతులపై దృష్టి సారించండి

- జిల్లా ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బసవ రాజేంద్ర

రాయికల్(జగిత్యాల): జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అన్ని రకాల వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర సూచించారు. శుక్రవారం రాయికల్ మండలం చెర్లకొండాపూర్, ఇటిక్యాల, రామారావుపల్లి, జగన్నాథపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు క్యూలైన్‌లో నిలబడేందుకు సౌకర్యాలు కల్పించాలని, ఓటింగ్ శాతం పెంచేలా బీఎల్వోలు చూడాలని ఆదేశించారు. 100 మీటర్ల దూరంలో ఎలాంటి ప్రచార కేంద్రాలు, వాల్‌రైటింగ్స్ లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్‌కుమార్, డీటీ వకీల్, ఆర్ఐలు కాంతయ్య, పద్మయ్య ఉన్నారు.

### స్నానం చేయిస్తాం.. ఓటు పట్టేస్తాం



ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మండలంలోని డబ్బా, వేములకుర్తి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వేములకుర్తిలో ఓ ఇంటి వద్ద వృద్ధుడు స్నానం చేస్తుండగా నాయకులు వెళ్లి అతడికి స్నానం చేయిస్తూ ఓటు అభ్యర్థించారు. ఎంపీటీసీ దెశెట్టి శాంత, నాయకులు దెశెట్టి జీవన్, పెంట లింబాద్రి, అంకతి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

### కల్యాణం.. కమనీయం

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలోని మార్కండేయ ఆలయంలో శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించి చిన రామాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. వేలాది మంది కల్యాణం తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలిగేటి రామకృష్ణ, ఎలగందుల రమేశ్, తాటికొండ సురేశ్, కొండబత్తిని శ్రీధర్, బూర్ల మహేశ్, సామల్ల శ్రీనివాస్, ఆడెపు శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో భక్తులు

# 'కట్టప్ప'లతో కలవరం!

- ఉమ్మడి జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ కౌన్సిలర్ ఒకరు పార్టీ మారుతున్నడనే సమాచారం కోవర్టుల ద్వారా తెలుసుకున్న సదరు నేత వెంటనే అప్రమత్తమై ఆ కౌన్సిలర్ పార్టీ మారకుండా బుజ్జగించాడు.
- ఒక ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసం కొంత డబ్బును రహస్యంగా కారులో హైదరాబాద్ నుంచి తన నియోజకవర్గానికి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. కోవర్టుతోనే సమాచారం లీకై నగదు పట్టుపడినట్లు ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.
- మరోనియోజకవర్గ నేత తన సెగ్మెంట్ పరిధిలో దసరా కానుకగా డీజే సౌండ్ బాక్స్‌లు పంచిపెట్టాలనుకున్నారు. అలాగే తన పేరుతో గోడ గడియారాలు పంచిపెట్టాడానికి లారీలో తరలిస్తుండగా పట్టుబడింది. ప్రత్యర్థుల పార్టీల్లోకి కోవర్టులను పంపి వారి సమాచారం సేకరించే సదరు నేతకు ఈసారి కోవర్టులతో రివర్స్ షాక్‌లు కొడుతున్నాయి. దీంతో ఎవరిని నమ్మాల్నో.. ఎవరికి ఏంచెప్పాల్నో అర్థమైతలేదని వాపోతున్నాడు.

- అన్ని పార్టీల్లో నేతలకు కోవర్టుల భయం
- వ్యూహాలు ప్రత్యర్థులకు చేరవేతలు
- ఎన్నికలు సమీపిస్తుండటంతో జోరుగా ఫిరాయింపులు
- రహస్య ఆపరేషన్స్‌కు కొత్తగా చేరిన వారిని దూరం పెడుతున్న నేతలు

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అన్ని పార్టీల్లో ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. దీంతో కొత్తగా వచ్చిచేరిన నేతలు లేదా పార్టీ మారకుండా అసంతృప్తిగా ఉన్న ఇంటిదొంగలు తమ వ్యూహాలు లీక్ చేస్తున్నారేమోనని పలువురు నేతలు సతమతమవుతున్నారు. సొంత శిబిరంలోని ఇలాంటి ×కట్టప్పల×ను పట్టుకోవడం ఎట్లా అని? వారు తలలు పట్టుకుంటున్నారు.



**నేతలకు కోవర్టుల టెన్షన్..**

- పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ కొలది నేతలకు కోవర్టుల టెన్షన్ పెరిగిపోతోంది.
- ఎన్నికల్లో విజయం సాధించాలంటే తాము ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తున్నామనేది ఎంతముఖ్యమో.. ప్రతిపక్ష పార్టీ నేతలు వేసే ఎత్తుగడలను ముందే పసిగట్టడం అంతే ముఖ్యంగా భావిస్తున్న నేతలు.. కోవర్టు అస్త్రాలు సంధిస్తున్నారు.
- ప్రత్యర్థి పార్టీల నేతలను తమ పార్టీలోకి లాక్కోవడంతోపాటు, తమ పార్టీలోని నేతలు ప్రత్యర్థి గూటికి చేరకుండా చూసుకోవడం ఇప్పుడు కత్తిమీద సాములా మారింది.
- దీంతో ప్రత్యర్థి పార్టీల్లో తమ అనుచరులను ఉంచేలా చూసుకుంటున్నారు.
- దానికోసం భారీగా ఆర్థిక సాయం అందించటంతోపాటు, ఎన్నికల అనంతరం పదవుల హామీతో ప్రత్యర్థి శిబిరంలోకి పంపుతున్నారు.
- ప్రజల నాడీ తెలియక తికమకపడుతున్నా నేతలకు, పార్టీలో మనస్ఫూర్తిగా పనిచేస్తున్న వారు ఎవరో, కట్టప్పలు ఎవరో తెలియక ఆందోళన చెందుతున్నారు.
- ఫిరాయింపు నేతలతోపాటు సొంతపార్టీల్లోనే ఉన్న అసమ్మతి నేతలను సైతం అనుమానిస్తూ, ఎవరిని నమ్మాలో తెలియక టెన్షన్ పడుతున్నారు.

**గతంలో చేదు అనుభవాలతో..**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలానియోజకవర్గాల్లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులే మళ్లీ ఎన్నికల బరిలో తలపడుతున్నారు. తాయిలాలు, డబ్బు, పార్టీలో చేరికలు తదితర అంశాలను కోవర్టులు లీక్ చేయటంతోనే గతంలో తీవ్రంగా నష్టపోయారు. ఈసారి ఎన్నికల్లో కీలకమైన ఆర్థిక వ్యవహారాలు, పార్టీ ఫండ్ తదితర వివరాలను పార్టీ నేతలకు కాకుండా తమ బంధువులు, కుటుంబ సభ్యులే చూసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఓటర్లకు ఇచ్చే నజరానాలు, ఫండింగ్ ఇస్తున్నదెవరు? అనే అంశాలను తమ అనుచరులకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు. పార్టీ నేతలు, కీలక నేతలను కేవలం ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాల ఖరారు చేయడానికే పరిమితం చేస్తున్నారు. దీంతో కొందరు కార్యకర్తలు నొచ్చుకుంటున్నారు. అయినా, ఒక్కోసారి ఎంతజాగ్రత్త పడినా రాత్రి అనుకున్న విషయాలు తెల్లారేలోగా పక్క పార్టీలకు చేరుతున్నాయి. ఇలా లీకేజీలకు పాల్పడుతున్న కోవర్టులు అన్ని పార్టీలకు దడపుట్టిస్తూ తలనొప్పిగా మారుతున్నారు.

## క్లుప్తంగా

### మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం

**మల్లాపూర్(కోరుట్ల):** అక్రమంగా మద్యం నిల్వ చేసినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రాధ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని సాతారం గ్రామశివారులో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. రేగుంట నుంచి సాతారంకు బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న రాజరెడ్డి, బుచ్చయ్య నుంచి రూ.10వేల విలువగల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు అఫ్రోజ్, రాంచందర్, సతీశ్, సివిల్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### ఒకరిపై హత్యాయత్నం కేసు

**జగిత్యాలక్రైం:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని పద్మనగర్ ప్రాంతానికి చెందిన కొక్కుల గంగాధర్, కొక్కుల శశికుమార్, కొక్కుల అన్నపూర్ణ, కొక్కుల లక్ష్మీబాయిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. పద్మనగర్‌కు చెందిన నిమిషకవి శ్రీరామ్ అదే ప్రాంతానికి చెందిన కొక్కుల గంగాధర్ ఇంటికి బుధవారం అర్ధరాత్రి వెళ్లాడు. ఇంట్లో ఉన్న గంగాధర్‌తో పాటు, అతని కుమారుడు శశికుమార్, భార్య అన్నపూర్ణ, తల్లి లక్ష్మీబాయిపై స్క్రూ డ్రైవర్‌తో పాటు, కత్తితో దాడిచేయగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గంగాధర్ ఫిర్యాదు మేరకు శ్రీరామ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పేర్కొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

**సిరిసిల్లటౌన్:** అప్పుల బాధతో పెయింటింగ్ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిరిసిల్లలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నక్క శ్రీనివాస్(40) పెయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తూ.. భార్య లావణ్య, కొడుకులు టింకూ(11), టోని(10)లతో ఉంటున్నాడు. ఇంట్లో బాధ్యతలు పెరగడం, అనారోగ్యంతో రూ.5లక్షలు అప్పులయ్యాయి. అప్పులు తీర్చేందుకు సంపాదన సరిపోకపోవడం.. అప్పులోళ్ల బాధలు ఎక్కువై మనస్థాపానికి గురై గురువారం సాయంత్రం ఇంట్లోనే గడ్డిమందును తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనలతో కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ చనిపోయాడు. చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడానికి, అంత్యక్రియలు జరపలేని నిస్సాహాయ స్థితిలో ఉన్నారు. దాతలు చేయాలని కోరుతున్నారు. సాయం చేసేవారు 97045 46180లో గూగుల్‌పే చేయాలని బాధితులు కోరుతున్నారు.



# పోల్‌చిట్టీల పంపిణీ ప్రారంభం

- జిల్లాలో మొత్తం 6,93,221 మంది ఓటర్లు
- ఇంటింటికీ వెళ్లి అందిస్తున్న బీఎల్‌వోలు



ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

**బుగ్గారం(ధర్మపురి):** అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 30న జరగబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లలో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే కళాకారులతో పలు ప్రదర్శనలు నిర్వహించిన అధికారులు యువత, వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ఎన్నికల రోజు ఎవరు ఎక్కడ ఓటు వేయాలనే సమాచారంతో కూడిన ఓటరు స్లిప్‌లను ఇంటింటికీ పంపిణీ చేయడం ప్రారంభించారు. ఇందుకోసం బీఎల్‌వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమకు కేటాయించిన ప్రాంతంలోని ఇంటింటా తిరుగుతూ ఓటర్లకు పోల్ చీటీలు అందిస్తున్నారు. వీటితో పాటు ఓటు ప్రాధాన్యతను తెలియజేసే ఓటరు గైడ్‌ను సైతం పంపిణీ చేస్తున్నారు. దీనిలో ఓటు హక్కు వినియోగంతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని ముఖ్యాంశాలు, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయు విధానం గురించి వివరించారు. ఈ నెల 21 వరకు వీటి పంపిణీని పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**మోడల్ పోలింగ్ కేంద్రాలు**

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 785 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో యువత కోసం 3, వికలాంగులకు 3, మహిళలకు 15 మోడల్ పోలింగ్ కేంద్రాలు, 15 ప్రత్యేకంగా మోడల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**వీటిని జాగ్రత్తగా గమనించాలి**

ఓటర్లు తమకు అందిన ఓటరు స్లిప్పులను జాగ్రత్తగా పరిశీలించాలి. తమకు అందించిన చీటి తమదో కాదో ధ్రువీకరించుకోవాలి. అలాగే పోల్ చీటిపై తమకు కేటాయించిన ఎన్నికల కేంద్రం వివరాలు, ఇతర నిబంధనలు పూర్తిగా చదవాలి. ఓటు వేసే రోజు ఎన్నికల సంఘం ప్రకటించిన జాబితాలోని 12 గుర్తింపు కార్డుల్లో ఒకదానిని తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలి. ఇంకా ఏవైనా సందేహాలుంటే స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించాలి. ఇందుకోసం పోల్ చీటిపైనే వారి పేరు, ఫోన్ నంబరు వంటి వివరాలు నమోదు చేశారు.

| జిల్లాలో.. | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 6,93,221 |
| పురుషులు | 3,34,946 |
| స్త్రీలు | 3,58,245 |
| ఇతరులు | 30 |
| నియోజకవర్గాలు | 3 |
| పోలింగ్‌కేంద్రాలు | 785 |

# చలిలో రాజకీయ వేడి!

- శీతాకాలం నేపథ్యంలో వణుకుతున్న నాయకులు, కార్యకర్తలు



**పెగడపల్లి(ధర్మపురి):** ఎన్నికల వేడితో గల్లీ నుంచి పట్నం వరకు ప్రచారాల హోరు జోరుగా సాగుతుంది. అయినా నాయకుల్లో వణుకు పుడుతోంది. ఎందుకో తెలుసా..? సర్పంచ్ ఎన్నికల నుంచి పార్లమెంటు ఎన్నికల వరకు ఎలాంటి ఎన్నికలు జరిగినా రాత్రికి రాత్రే ఓటర్లలో మార్పు వచ్చింది. పోటీలో ఉన్న ఇతర అభ్యర్థికి కొన్ని ఓట్లు అధికంగా వచ్చాయని రచ్చబండ వద్ద ముచ్చట్లు జరిగేవి. అభ్యర్థుల రహస్య మంతనాలన్నీ నిశీథి రాత్రిలో జరిగేవి. అసెంబ్లీ ఎన్నికలు చలికాలం రావడంతో నాయకులు పగటి ప్రచారాలు చేసుకుంటున్నారు. రాత్రి పదింటి వరకు అనుమతి ఉన్నప్పటికీ 'చలిపులి' భయంతో అభ్యర్థులు తిరగలేక పోతున్నారు. ఎలాగోల గ్రామాలకు వెళ్లినా ప్రజలు ఎనిమిదింటికే తలుపులు మూసేస్తున్నారు. వారం రోజుల నుంచి చలి పెరుగుతుండటంతో ప్రచారానికి వెళ్లే నాయకులు, కార్యకర్తలు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం అయిందంటే చలి ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటి నుంచి మొదలై ఈనెల 30న పోలింగ్ ముగిసేవరకు చలి తీవ్రత రోజురోజుకు పెరిగే అవకాశముంది. దీంతో పోటీ చేసే అభ్యర్థుల వెన్నులో వణుకు కూడా పెరగనుంది. ఎండాకాలంలో పగటి సమయం ఎక్కువగా ఉండి రాత్రి సమయం తక్కువగా ఉంటుంది. కానీ చలికాలంలో 'మాఘి' పొద్దుగా గ్రామీణ ప్రజలు పిలుస్తుంటారు. ప్రస్తుతం సాయంత్రం 5:30 గంటల నుంచే చీకటి ఛాయలు అలుముకుంటున్నాయి. దీంతో ప్రచారానికి పగటి సమయం తక్కువగా ఉండనుంది. ఉదయం 10 గంటల వరకు చలి వీడే అవకాశం లేదు. మధ్యాహ్నం 1–2 గంటల మధ్య సమయం దాదాపు భోజన విరామమే. దీంతో అభ్యర్థులకు ఉదయం 3 గంటలు, మధ్యాహ్నం 3 గంటల చొప్పున సమయం మాత్రమే ప్రచారానికి అనుకూల సమయం కానుంది. సభలు, సమావేశాలు 5 లోపు ముగిసే అవకాశం ఉంటేనే జనాలు వచ్చే పరిస్థితి ఉంటుంది. దీనికి తోడు ప్రస్తుతం రైతులు వరిపొలాలు కోయడం, ధాన్యం విక్రయించుకునే పనుల్లో బిజీగా ఉండటం వల్ల కూడా ప్రచారంలో కలవలేక పోతున్నారు. ఎండకాలంతో పోలిస్తే చలికాలం ప్రచారానికి గడ్డుకాలమేనని నాయకులు భావిస్తున్నారు. ఒక వైపు రాజకీయ పరిస్థితులు వేడెక్కుతున్నాయి. ఎవరి నోట విన్నా ఎన్నికల చర్చ జోరుగా కొనసాగుతోంది.

# తెలంగాణలోనే బీడీ కార్మికులకు పింఛన్లు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



రామాజీపేటలో పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**జగిత్యాల:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే బీడీ కార్మికులకు పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీడీ టేకేదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా 2009 వరకు జీవన్‌రెడ్డి మంత్రిగా ఉన్నా జగిత్యాల పట్టణంతో పాటు, రాయికల్, సారంగాపూర్ మండలాల్లో ఎలాంటి పనులు చేపట్టలేదని ఆరోపించారు. ఎల్.రమణ ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం నర్సింగ్ కళాశాల తీసుకురాగా, జీవన్‌రెడ్డి అడ్డుపడి కళాశాల భవనానికి స్థలం సైతం ఇవ్వనివ్వలేదని, అనంతరం మళ్లీ ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఎమ్మెల్సీ కవిత సహకారంతో 4,500 ఇళ్లు మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. ఒడ్డెలింగాపూర్, అల్లీపూర్‌ను మండలాలు చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, అత్యధిక మెజార్టీతో సంజయ్‌ను గెలిపించాలని కోరారు.

**నా మాటలు వక్రీకరించారు..**

తాడు మాట్లాడిన మాటల్లో కొన్ని వక్రీకరించి సోషల్ మీడియాలో పెడుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రతిపక్ష నాయకులు జీవన్‌రెడ్డిని చాలారోజులు బతుకు అని మాట్లాడటం జరిగిందని, దానిని బతుకరు అని వేరే అర్థం వచ్చేలా సోషల్ మీడియాలో పెడుతున్నారని, అది చాలా బాధాకరమన్నారు. జీవన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ఆంజనేయుని సాక్ష్యంగా చెబుతున్నానని, తానేమీ అనలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఫ్యాక్స్‌చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌తోనే సామాన్యులకు న్యాయం**

**రాయికల్(జగిత్యాల):** బీఆర్‌ఎస్‌తోనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన సుమారు 200 మంది, కుర్మపల్లికి చెందిన 20 మంది కాంగ్రెస్‌ను వీడి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రాయికల్‌లో కుల సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేపిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైద్యులు మోర సుమన్, మోర సుజిత్, రామాజీపేట సర్పంచ్ బెజ్జంకి రమాదేవి, మోహన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**కష్టపడి పనిచేయండి**

**సారంగాపూర్(జగిత్యాల):** పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగునూర్, లచ్చక్కపేట గ్రామాలకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. విండో వైస్‌చైర్మన్ పల్లపు బాపిరాజు, సర్పంచ్ కాసుగంటి వెంకటరమణారావు, నాయకులు పాల్గొన్నారు.



వంజరిపల్లిలో ప్రచారం చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక

**ఇంటింటా బీఆర్‌ఎస్ పథకాలు అమలు**

**జగిత్యాలరూరల్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారులు ప్రతీ ఇంట్లో ఉన్నారని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లిలో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ చేకుంట రజిత, రైతుబంధు మండల కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేశ్, ఉపసర్పంచ్ ప్రణవి, తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత హామీలు నమ్మొద్దు



వేంపేటలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్



బీఆర్‌ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్

**మల్లాపూర్(కోరుట్ల):** నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలం చిట్టాపూర్, గుండంపల్లి, సాతారం, రేగుంట, గొర్రెపల్లి, వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపిన సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి రావాలని చూస్తున్నాయని, ఆ నాయకుల మాటలు నమ్మి మోసపోతే మళ్లీ గోసపడుతామన్నారు. బీజేపీ అభ్యర్థి అరవింద్, కాంగ్రెస్ అభ్యర్థి నర్సింగరావు రూపాయి అభివృద్ధి చేయకుండా అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎన్నికలప్పుడే బయటకు వచ్చే వీరికి ఓట్లతోనే తగిన బుద్ధిచెప్పాలన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గోరు నాగేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్‌లు బొడ్డు సుమలత, దనరేకుల మల్లు, కుందేళ్ల నర్సయ్య, బిట్ల సరోజన, జోగుల మమత, కొంపెల్లి సరోజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సంజయ్‌ను ఆశీర్వదించండి**

ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేసే వారికే పట్టం కట్టాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలం పాతదాంరాజుపల్లికి చెందిన యువకులు సర్పంచ్ మైదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. తన కుమారుడు డాక్టర్ సంజయ్‌కుమార్‌ను ఆశీర్వదించాలని కోరారు.

**అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడతా**

**మెట్‌పల్లిరూరల్(కోరుట్ల):** తనను గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం పాటుపడుతానని బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ అన్నారు.శుక్రవారం మెట్‌పల్లి మండలం వేంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ మారు సాయిరెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే కూతురు ప్రచారం**

**కోరుట్లరూరల్:** మండలంలోని మోహన్‌రావుపేటలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కూతురు డాక్టర్ సమత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డాక్టర్ సంజయ్ యువ నాయకుడని ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ప్రచారం చేశారు. సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి, సోంబాబు, కర్ణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి**

**మెట్‌పల్లి(కోరుట్ల):** ప్రజలకు అండగా ఉండే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ తల్లి సరోజ కోరారు. శుక్రవారం మెట్‌పల్లి పట్టణంలోని 4వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఎంతో కృషి చేశారని, తన కుమారుడు సైతం అదే రీతిలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాడని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, నాయకులు పాల్గొన్నారు.

# లైంగికదాడి కేసులో యావజ్జీవ శిక్ష

**జగిత్యాలజోన్:** అభం, శుభం తెలియని 8 ఏళ్ల బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నిందితుడు ఎండీ ముస్తఫాకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.7,000 జరిమానా విధిస్తూ జగిత్యాల పోక్సో కోర్టు జడ్జి, అదనపు జిల్లా జడ్జి సుగళి నారాయణ శుక్రవారం తీర్పు చెప్పారు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదుగంటి బాల త్రిపురసుందరి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన భార్యాభర్తలు కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి వచ్చారు. వీరికి 8 ఏళ్ల కూతురు, 6 ఏళ్ల కొడుకు ఉన్నారు. ఈనేపథ్యంలో జూన్ 8, 2014న ఎప్పటి మాదిరిగానే భర్త కూలీ పనికి వెళ్లాడు. భార్య తాగునీరు తెచ్చుకునేందుకు వీధిలో ఉండే పబ్లిక్ నల్లా వద్దకు వెళ్లింది. అదే సమయంలో తనతో వచ్చిన 8 ఏళ్ల కూతురు పక్కనున్న ముస్తఫా అనే వ్యక్తి కిరాణం షాపులో కుర్‌కురే ప్యాకెట్ కొనుక్కునేందుకు వెళ్లింది. తల్లి ఇంటికి వచ్చినా కూతురు మాత్రం రాలేదు. ఈ విషయాన్ని తన భర్తకు, ఇంట్లో వారికి చెప్పగా, అందరూ వచ్చి వెతకగా ఎక్కడా కనబడలేదు. బాలిక తల్లిదండ్రులు ముస్తఫా కిరాణం షాపునకు పోయి తమ బిడ్డ వచ్చిందా అని అడుగగా రాలేదని చెప్పారు. చుట్టుపక్కల గాలిస్తుండగా, చిన్నారి ముస్తఫా కిరాణం నుంచి బయటకు రావడం చూసి ఇంటికి తీసుకెళ్లారు. ఇప్పటి దాకా ఎక్కడికి వెళ్లావు అంటూ గద్దించి అడిగారు. ముస్తఫా అంకుల్ షాపులోకి తీసుకెళ్లి తనతో చేసిన పనులను బాలిక తల్లిదండ్రులకు వివరించింది. ఈ విషయాలు ఎవరికైనా చెబితే తనను చంపుతానని బెదిరించా రంటూ బాలిక చెప్పింది. జరిగిన ఘటనపై వెంటనే తల్లిదండ్రులు మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రాజేశ్ కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ కె.రాజశేఖర్‌రాజు, సిరిసిల్ల, జగిత్యాల డీఎస్పీలు డి.నర్సయ్య, పి.పరమేశ్వర్‌రెడ్డి, ఎస్.రాజేంద్రప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, బి.రాజు, టి.రంజిత్‌కుమార్ కేసుకు సంబంధించి బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడు ముస్తఫాకు యావజ్జీవ శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

### రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



సిద్ధార్థ(ఫైల్)

**జమ్మికుంట:** రోడ్డు ప్రమాదంలో ఓ మైనర్ బాలుడు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పట్టణ ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన అకుల సిద్ధార్థ(సిద్దు) అనే మైనర్ బాలుడు (15), పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన ఎండీ గౌస్ ఇద్దరు కలిసి మోత్కులగూడెం నుంచి బైక్‌పై వస్తున్నారు. జమ్మికుంట పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మినీ వ్యాన్(ట్రాలీ) బైక్‌ను ఢీకొట్టగా.. సిద్ధార్థ తలకు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న ఎండీ గౌస్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి ఆకుల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**ఇద్దరికి గాయాలు**

**తిమ్మాపూర్:** నుస్తులాపూర్ వైన్స్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పొలంపల్లి గ్రామానికి చెందిన పడాల కొమురయ్య తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం నుస్తులాపూర్‌కు వెళ్లాడు. తిరిగి పొలంపల్లి వెళ్లే క్రమంలో గ్రామ శివారులోని వైన్స్ వద్ద నల్లగొండ గ్రామానికి చెందిన మార్క రాజయ్య రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. అదుపుతప్పి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

### పెద్దమ్మ ఆలయంలో చోరీ

**గన్నేరువరం:** గన్నేరువరంలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామ పోచమ్మ ఆలయ సమీపంలో పెద్దమ్మ ఆలయముంది. ఎప్పటిలాగే ఆలయ పూజారి సమ్మయ్య శుక్రవారం ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజలు చేయడానికి ఆలయం శుభ్రం చేస్తున్న క్రమంలో ఆలయ తలుపుల తాళం ధ్వంసమై ఉండడంతో.. స్థానికులు, పోలీసులకు సమాచారమందించారు. ఏఎస్సై లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను సేకరించడానికి క్లూస్ టీంను రప్పించారు. ధ్వంసమైన తాళంతో పాటు తలుపులు, ఆలయ హుండీ, పెద్దమ్మ తల్లి విగ్రహం వద్ద ఆనవాళ్లు సేకరించారు. పెద్దమ్మ తల్లి విగ్రహంపై ఉన్న పుస్తెలు, ముక్కుపుడక, నక్లెస్ మొత్తం రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు బోయిని పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

# లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం



మోహన్ (ఫైల్)

**జగిత్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో విద్యుత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలం నాగునూర్ గ్రామానికి చెందిన జంగ మోహన్(60), జంగ మహేశ్ ద్విచక్ర వాహనంపై నూకపల్లిలోని మహేశ్ భార్య గౌతమి, ఇద్దరు కుమారులను తీసుకువచ్చేందుకు బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట టిప్పర్ ఢీకొనడంతో మోహన్ అక్కడికక్కడే మృతిచెందాడు. మహేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జంగ పద్మ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన బోదాసు సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. కాగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో మోహన్ మృతదేహాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. బాధితుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

**మేడ్చల్‌లో రోడ్డు ప్రమాదం.. బొప్పాపూర్‌లో విషాదం**



అజీజ్(ఫైల్)

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** మేడ్చల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన యువకుడు అజీజ్ దుర్మరణం చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. జీవనోపాధి కోసం అజీజ్ ఆటో నడుపుతుండేవాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో వెళ్తుండగా అతివేగంగా వచ్చిన ఇసుక టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజీజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అజీజ్ మృతితో బొప్పాపూర్‌లో విషాదం అలుముకుంది.

# లారీ ఢీకొని ధాన్యం ట్రాక్టర్ బోల్తా

**తిమ్మాపూర్:** నుస్తులాపూర్ రాజీవ్ రహదారిపై ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రా క్టర్‌ను అదే దారిలో వెళ్తున్న లారీ ఢీకొంది. ట్రాక్టర్ బోల్తా పడగా.. రోడ్డు మీద ధాన్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. స్థానికులు పోలీసులకు సమాచారమందించడంతో.. అక్కడకి చేరుకొని ట్రాఫిక్ నియంత్రించారు. ట్రాక్టర్ శంకరపట్నం మండలం నుంచి అలుగునూర్ వెళ్తున్నట్లు ట్రాక్టర్ డ్రైవర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు





తీవ్రంగా గాయపడిన మహిళలు

**ఆటో బోల్తా పడి..**

**మెట్‌పల్లి(కోరుట్ల):** మెట్‌పల్లి పట్టణ శివారులో ఆటో బోల్తాపడింది. శుక్రవారం మెట్‌పల్లి నుంచి జగ్గాసాగర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో పట్టణ శివారులోని బ్లూఫాక్స్ రెస్టారెంట్ సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆటోను పైకి ఎత్తి బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారిలో జగ్గాసాగర్ గ్రామానికి చెందిన కమల, బుచ్చమ్మ, లాస్య, బావాయి, వనిత, భూదేవి, అరుణ, చిన్నారి కృతి ఉన్నారు. ఇందులో ఇద్దరి పరిస్థితి కొంత విషమంగా ఉండడంతో ఒకరిని నిజామాబాద్, మరొకరిని జగిత్యాలకు తరలించారు. ఆటో డ్రైవర్ పరారైనట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ చిరంజీవి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.


**మారుతినగర్ శివారులో..**

**మెట్‌పల్లిరూరల్(కోరుట్ల):** మెట్‌పల్లి మండలం మారుతినగర్ శివారులో ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని కారు ఢీకొనగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌కు చెందిన బాస శ్రీనివాస్ తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన సీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాసరావు బాధితుడిని తన కారులో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి మానవత్వాన్ని చాటుకున్నాడు.



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

**ఎల్లారెడ్డిపేటలో..**



గాయపడిన కిషన్

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రేసు కిషన్ శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. స్థానిక పాతబస్టాండ్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టుకోగా, ఓ బైక్‌పై ప్రయాణిస్తున్న కిషన్ అదుపుతప్పి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిషన్‌ను సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

**చందుర్తి మండలంలో..**



సంఘటన స్థలంలో రాములు

**చందుర్తి(వేములవాడ):** మండలంలోని ఎన్గల్, మర్రిగడ్డ గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాలకు చెందిన నీలి రాములు(55) ఎన్గల్ గ్రామానికి బైక్‌పై వెళ్లి తిరివస్తుండగా ఎన్గల్–మర్రిగడ్డ గ్రామాల మధ్య గల కల్వర్టు వద్ద రోడ్డుపై పెద్ద గుంతను గమనించపోవడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో రాములు తలకు బలమైన గాయమై, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన చుట్టుపక్కల చేలలోని రైతులు వెంటనే క్షతగాత్రున్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.